క్లుప్తంగా

తిరుమల పవిత్రతను దెబ్బతీశారు


మాట్లాడుతున్న కృపాలక్ష్మి


శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కూటమి మంత్రులు, నాయకులు తిరుమల పవిత్రతను దెబ్బతీశారు అని గంగాధరనెల్లూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి అన్నారు. ఆమె మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం టీటీడీ లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు సరికాదు అని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే హిందూ ధర్మపరిషత్‌కు జగనన్న జీవం పోసి హిందూ ఆలయాలను అభివృద్ధి చేశారన్నారు. సూపర్ సిక్స్ ఇతర హామీలను అమలుచేయకుండా రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించడానికి తిరుమల మహా ప్రసాదంపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


స్వచ్ఛతపై ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు, అధికారులు

పాలసముద్రం : పరిసరాల శుభ్రతతో ఆరోగ్య భద్రత లభిస్తుందని ఎంపీడీఓ రామనాథరెడ్డి అన్నారు. వనదుర్గాపురం సర్పంచ్ నరసింహరాజు, మండల విస్తరణాధికారి రమేష్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ సమాజానికి, పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంగా మారింది. దాన్ని మనం నివారించకపోతే అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లో పరిసరాలను పారిశుధ్య పార్మికులతో కలసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, ధరణిప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వినాయక పూజ


తూగుండ్రంలో కొలువైన వినాయకుడు

గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రంలో భక్తి శ్రద్ధలతో వినాయక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి తూగుండ్రంలో కల్యాణమండపం వద్ద గ్రామస్తులు, యువకుల ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వినాయకుడి విగ్రహాన్ని గ్రామ నడిబొడ్డున చలువ పందిళ్ల కింద అందంగా అలంకరించిన విద్యుత్ దీపాల మధ్య కొలువు దీర్చి పూజలు చేశారు. అనంతరం ప్రసాదాలను పంచిపెట్టారు. శుక్రవారం 1000 మందికి అన్నదానం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని వినాయక స్వామిని దర్శించుకున్నారు.

బొమ్మలతో బోధన ఎంతో ఉపయోగకరం


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఎంఈఓ

నింద్ర: బొమ్మలతో విద్యార్థులకు బోధన చేయడం ఎంతో ఉపయోగకరమని ఎంఈవో శ్రీధర్‌రాజు అన్నారు. మండలంలోని ఎలకాటూరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయుడు భాస్కర్ రావు విద్యార్థులకు బొమ్మలతో బోధించారు. ఆయన 15 రోజుల పాటు కేంద్ర ప్రభుత్వ శిక్షణ పొందారు. ఆ శిక్షణలో నేర్చుకున్న బోధనా విధానాన్ని ఇక్కడ ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వసుమతి, సిఆర్‌పిలు మునెమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యే లక్ష్యం కావాలి


అభ్యసనా సామగ్రి పంపిణీ అనంతరం పిల్లలతో ఎంఈఓ, ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: పేద విద్యార్థులకు ఉన్నత విద్యే ప్రధాన లక్ష్యం కావాలని ఎంఈఓ మహేశ్వరరావు అన్నారు. మండలంలోని దేవళంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆయన శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయురాలు లీలావతి ఆధ్వర్యంలో అభ్యసనా సామగ్రిని పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అండగా నిలవాలన్న సంకల్పంతో టీచర్ అభ్యసనా సామగ్రిని అందించి, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ దాతలు అందించే సామగ్రిని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు నాగరాజారెడ్డి, వెంకటాద్రి నాయుడు, శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

వంద రోజులు..

హామీల ఊసేదీ?

- ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- ఏ హామీ నెరవేరలేదు
- అయోమయంలో ప్రజలు

మూతబడి ఉన్న నింద్ర నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ



ఫ్యాక్టరీ వద్ద నిరసన వ్యక్తం చేసిన చెరకు రైతులు (ఫైల్)


విజయపురంలో ఎంపిక చేసిన ఇండస్ట్రియల్ ఏరియా

నగరి : కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ఇచ్చిన హామీలు ఒక్కటంటే ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్థి తాను అధికారంలోకి వస్తే నియోజకవర్గంలోని మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, బెస్ట్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామని, నింద్ర మండలంలో మూతబడ్డ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని అందులో రైతులకు రావలసిన బకాయిలు అందజేస్తామని, విజయపురం మండలాన్ని ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా తయారుచేస్తామని అక్కడ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో చెప్పించారు. నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో నివసించే మరమగ్గ కార్మికులు, చెరకు రైతులు, నిరుద్యోగులు ఈ హామీలకు ఆకర్షితులయ్యారు. ఎన్నికల్లో కూటమి పార్టీకి బలాన్ని చేకూర్చారు. కూటమి పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అయితే వారు పెట్టుకున్న నమ్మకం వంద రోజులు పూర్తి చేసుకున్నా నెరవేరలేదు. విద్యుత్ బిల్లులు చెల్లించడానికి మూడు నెలలుగా ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లే మరమగ్గ కార్మికులు బిల్లు తగ్గిందా, ఉచిత యూనిట్లు వచ్చిందా అని అడగడం మినహా అది ఇప్పటి వరకు నెరవేరలేదు. నింద్ర నేటమ్స్ షుగర్ ఫ్యాక్టరీ నుంచి బకాయిలు వస్తాయని, ఫ్యాక్టరీ తెరిచేస్తారని ఆశపడ్డ రైతులకు నిరాశే మిగిలింది. విజయపురం ఇండస్ట్రియల్ పార్కు విషయానికి వస్తే ఇటీవల కొందరు అధికారులు ఎమ్మెల్యేతో పాటు వచ్చి స్థలాన్ని చూసి మామిడి తోటలు పరిశీలించి వివరాలు సేకరించి వెళ్లారు. ఆపై అధికారులు భూములకు నష్టపరిహారం ఇచ్చారు. చెట్లకు ఇవ్వలేదు ఈ కారణంగా ఎలాంటి పనులు సంబంధిత ప్రాంతంలో జరగలేదు. దీంతో కూటమికి మద్దతు పలికిన ఓటర్లు అయోమయంలో పడ్డారు.

బకాయిలు ఇంకా చెల్లించలేదు



నేను నింద్ర షుగర్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పనిచేశా, నా పొలంలో పండించిన చెరకు ఆ ఫ్యాక్టరీకే తరలించా. చెరకు తరలించిన డబ్బులు, కార్మికునిగా నేను పనిచేసినందుకు రావలసిన జీతం బకాయిలు ఏడేళ్లుగా రాలేదు. రూ.1.5 లక్షలు బకాయిలు రావాలి. ఎన్నికల సమయంలో చెరకు బకాయిలు ఇప్పిస్తామని, ఫ్యాక్టరీ మళ్లీ తెరిపిస్తామని ప్రస్తుత ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అయితే పాలన వందరోజులు పూర్తయినా బకాయిలు అందలేదు.

– రమేష్ రెడ్డి, చెరుకురైతు, నింద్ర

ఫ్యాక్టరీ సమస్యకు తాళం



చెరకు ఫ్యాక్టరీ తెరిపిస్తాం, చెరకు రైతుల బకాయిలు ఇప్పిస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వ నేతలు ఎన్నికల్లో గెలవడంతో హామీలు మూటకట్టి పడేశారు. పాలన వంద రోజులు అవుతున్నా వారు ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేరలేదు. నాకు రూ.2 లక్షల వరకు బకాయిలు రావాలి. ఇలా ఫ్యాక్టరీ నుంచి రైతులకు రూ. 37 కోట్లు బకాయిలు రావాలి. ఇటీవల చెరకు రైతులు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. అయినా ఫలితం లేదు.

– మునికృష్ణారెడ్డి, చెరుకు రైతు, అత్తూరు.

పారిశ్రామిక హబ్ లేదు...ఉపాధి ఊసే లేదు

వెదురుకుప్పం: ఎన్నికల ముందు గంగాధరనెల్లూరును మరో కుప్పం తరహాలో అభివృద్ధి చేసి చూపిస్తామంటూ ఊదర గొట్టిన ఎమ్మెల్యే థామస్ ఆదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని ప్రజలు అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా నేటికీ అతీగతీ లేదు. నియోజకవర్గం అభివృద్ధి అటుంచితే నాటి నుంచి నేటి వరకు అక్రమాలకు నిలయంగా మారిందని నియోజకవర్గ ప్రజలు బాహాటంగా చెబుతున్నారు. సంక్షేమం పక్కన పెడితే దందాలు అధికమయ్యాయని పెద్ద ఎత్తున దుమారం రేపుతోంది. కొత్తగా పరిశ్రమలు తీసుకొచ్చి పారిశ్రామిక హబ్‌గా నెలకొల్పి తద్వారా 40 వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ హామీలు గుప్పించినా అతీగతీ లేదని నిరుద్యోగ యువత మండిపడుతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా ఎమ్మెల్యే థామస్ ఇచ్చిన ఏఒక్క హామీ అమలులో కార్యరూపందాల్చలేదన్న చర్చ మొదలైంది.

జీడీ నెల్లూరులోనూ అదే పరిస్థితి

- గంగాధరనెల్లూరు మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి ఆచరణకు నోచుకోలేదు.
- వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామన్న మాట మర్చిపోయారు.
- ప్రతి గ్రామంలోనూ సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపడతామని చెప్పినా పట్టించుకోలేదు.
- గంగాధరనెల్లూరులో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు.
- మెడికల్ హబ్‌గా నెలకొల్పి అందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పినా ఆదిశగా అడుగులు వేయలేదు.
- ప్రతి దళితవాడలోనూ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కలగా మిగిలింది.
- అర్హులైన పేదలందరికీ మూడు సెంట్ల ఇంటి స్థలాల మంజూరు ఊసే లేదు.
- ప్రతి గ్రామానికీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు చేపట్టలేదని ప్రజలు అంటున్నారు.
- మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా లక్షాధికారులు చేస్తామన్న హామీ గాల్లో కలిసిపోయిందని మహిళలు మండిపడుతున్నారు.
- పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం, పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పం, దేవళంపేట మీదుగా కొత్తపల్లె మిట్ట వరకు ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్డు వేస్తామని చెప్పినా ఖాతరు చేయలేదని ప్రయాణికులు అంటున్నారు.

జెడ్పీటీసీకి పరామర్శ


జెడ్పీటీసీని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : ఇటీవల అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డిని మంగుంటలోని వారి స్వగృహంలోకి వెళ్లి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ మండల అభివృద్ధికి జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి కృషి చేశారని అన్నారు. ఆయన త్వరగా కోలుకోని వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు, నాయకులు అందుబాటులో ఉంటానన్నారు. ఎవరూ అధైర్య పడవద్దు అని భరోసా కల్పించారు. అక్రమ కేసులకు భయపడకుండా అందరూ ఐకమత్యంతో ఉండి కూటమి నాయకులు చేసే అరాచకాలను ఎదుర్కొని ప్రజల తరపున పోరాడడానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత,"మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి,ఎ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు దిలీప్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కుప్పయ్య, మణి, జనార్దన్, బాబు, మునికృష్ణ, దామునాయుడు, డిసెంబర్‌శెట్టి, మార్కొండయ్య, హరి, హరిప్రసాద్‌రెడ్డి, రామనాధరెడ్డి, అళ్లిముత్తు, లోక పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ బాలుపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక సర్పంచ్ భారతి పరిష్కరించారు. గ్రామంలో ఉన్న బోరు మోటారు పాడవడంతో నీటి కొరత ఏర్పడింది. దీంతో తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి పంచాయతీ నిధుల ద్వారా కొత్త మోటారు అమర్చి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్

విజయపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో కృష్ణవేణి అన్నారు. మండలంలోని పీఆర్ కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శించిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. సీడీపీవో కృష్ణవేణి మాట్లాడుతూ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పోషణ, పోషకాహారం, శుద్ధమైన తాగునీరు, పరిసరాల శుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. మండలంలో 51 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని సూచించారు. అంగన్వాడీ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పోషణ, ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి పోషకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, చాముండేశ్వరి, ఇందు, భారతి, అముద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


విజయపురం పీఆర్ కండ్రిగలో పోషణ అభియాన్

పౌష్టికాహార మాసోత్సవం

నింద్ర: మండలంలోని ఎలకాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. సూపర్ వైజర్ శ్యామల మాట్లాడుతూ తల్లీ బిడ్డకు పౌష్టికాహారం చాలా ముఖ్యమని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం తీసుకున్న వారందరూ తమ పిల్లలకు అందించాలన్నారు. చిన్నతనం నుంచి రక్త హీనత లేకుండా చూడాలని అన్నారు. పిల్లలకు అందించే ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రమీల, ద్రాక్షాయణి, కవిత, భారతి, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్కూల్ గేమ్స్ పోటీలు

నగరి : మండలంలోని క్రీడా మైదానాల్లో 68వ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు దోహదం చేస్తాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలకు ప్రాచుర్యం కల్పించే ఉద్దేశంతో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఇలా పోటీలు నిర్వహిస్తుండడంతో మైదానాల్లో సందడి నెలకొనడమే కాకుండా క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నాగరాజకుప్పం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం అండర్ 14, 17 బాల బాలికలకు మండల స్థాయి చెస్, యోగా, అథ్లెటిక్స్, ఖోఖో టోర్నమెంట్, నియోజకవర్గ స్థాయి సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సుమారు 320 మంది క్రీడాకారులు ఈ పోటీలకు పాల్గొన్నారు. నగరి మండల కో–ఆర్డినేటర్ కేశవులు, ఆర్గనైజర్ చెన్నకేశవులు, సీనియర్ కబడ్డీ కోచ్‌లు పీడీ మణి, రాజేశ్వరి పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునిరత్నం ఆధ్వర్యంలో సెలక్షన్స్ లిస్ట్ ప్రకటించారు. పీఈటీలు స్వప్న, గౌరీ సాని, చంద్ర, గోపి, సతీష్ , పాండేయన్, ముని కుమార్, భాస్కర్, మీనారాణి, కవిత, సైదిమా విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. 2011 జనవరి 1 తరువాత జన్మించిన విద్యార్థులు అండర్ 14 కేటగిరికి, 2008 జనవరి1 తర్వాత జన్మించిన విద్యార్థులు అండర్ 17 కేటగిరితో తీసుకుంటామని సీనియర్ పీడీ సురేష్‌బాబు తెలిపారు. త్వరలో మండల స్థాయిలో ఇతర క్రీడలు కూడా నిర్వహించి ఎంపిక పూర్తిచేస్తామని, అనంతరం నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు.


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



చెస్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవోలు, చెస్ ఆడుతున్న విద్యార్థులు,

నేటి నుంచి ప్రజావేదిక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తిచేసుకున్న నేపథ్యంలో శనివారం నుంచి ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ముహ్మద్ రియాజ్ ఉద్దీన్ తెలిపారు. 21న దిగువమాసాపల్లి, ఆనగల్లు, 23న ముత్తుకూరు, బీఎన్‌ఆర్‌పేట, అనంతాపురం, 24న పెరుమాళ్ల కండ్రిగ, గువ్వకల్లు, చింతలగుంట, తాళంబేడు, 25న తొప్పాతిపల్లి, తుమ్మింద, నాయని చెరువు, పెద్దిశెట్టిపల్లి, 26న చెర్లోపల్లి, పాలూరు, పచ్చనపల్లిలో గ్రామసభలు నిర్వహించి, సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అవసరం


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ స్వరూప

కార్వేటినగరం: పిల్లల విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని రాజాకుమార రాజా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.స్వరూప అన్నారు. కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పిల్లల వ్యవహార శైలిపై ప్రత్యేక దృష్టి సారించి వారి విద్యాభ్యాసంలో ఎలాంటి ఒడిదుడుకులు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. విద్యార్థులకు కళాశాలలో నిర్వహించే పరీక్షల్లో పిల్లలు సాధించిన మార్కులను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు సహకరించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజయపురం ఎస్‌ఐగా బలరాం



విజయపురం : స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐగా బలరాం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కదిరి టౌన్ నుంచి బదిలీపై వచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేకంగా నిఘా ఉంచనున్నట్లు చెప్పారు. చోరీలు, జూదం, నాటుసారా తయారీ, అమ్మకాలు నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత

- ప్రభుత్వం చెప్పేదొకటి చేసేది మరొకటి
- కూతవేటు దూరంలో ఉన్నా అందని ద్రాక్షలా ఇసుక


పునాదిలో ఆగిపోయిన దృశ్యం


సగంలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణం

గంగాధర నెల్లూరు: వంద రోజుల కూటమి ప్రభుత్వంలో 100 కష్టాలు పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దేశ చరిత్రలోనే ఎవ్వరూ ఇవ్వలేనంతగా గత ప్రభుత్వం గృహ నిర్మాణాలకు స్థలాలతోపాటు అవసరమైన నగదు, సామగ్రిని అందజేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక దొరకడం లేదు. అయినా 100 రోజుల్లో పునఃప్రారంభించాలని, పూర్తి చేయాలని లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నారు. గత ప్రభుత్వంలో గంగాధర నెల్లూరు మండలంలో 3,175 నిర్మాణాలు మంజూరుకాగా గత ప్రభుత్వంలోనే 2,136 ఇళ్లు 100% పూర్తయ్యాయి. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న 859 నిర్మాణాలు మార్చి 2025వ తేదీలోపు కచ్చితంగా పూర్తి చేయాలని ప్రభుత్వం వంద రోజుల పథకం తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా 210 రూఫ్ లెవెల్, 221 రూఫ్ కాస్ట్ పూర్తయిన ఇళ్లను వంద రోజుల్లోపు నిర్మాణం పూర్తి చేయాలని నోటీసులు అందజేశారు. వంద రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశాలిచ్చిన ఇసుక ఏమాత్రం ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. మరోవైపు నీవా నది నుంచి ఇసుక తీసుకోవచ్చని పత్రికల్లో ప్రకటనలు వస్తున్నాయి. అయితే ఇసుక తీసుకురావడానికి వెళితే పోలీసులు అక్రమ రవాణా పేరు చెప్పి కేసులు బుక్ చేస్తున్నారు. చిత్తూరు రూరల్ మండలం నుంచి ప్రభుత్వ నిర్దేశిత రీచ్ నుంచి ఇసుక తీసుకురావడానికి ఒక ట్రాక్టర్ వెళితే రోజు ఒక లోడ్ మాత్రమే తీసుకువచ్చే అవకాశం ఉంది. ఒక ట్రాక్టర్ ఇసుక లోడ్ చేసుకోవడానికి రెండు మూడు రోజుల సమయం పడుతుంది. అన్ని రోజులకు ట్రాక్టర్‌కు బాడుగ ఇవ్వలేక సమయానికి ఇసుక తీసుకురాలేక, పనులు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

నిర్మాణం కష్టమవుతుంది



ఇసుక లేకుండా ఇళ్ల నిర్మాణం చాలా కష్టమవుతుంది. గత ప్రభుత్వంలో ఇల్లు మంజూరు చేయడంతో కూలీనాలీ చేసుకుని ఇల్లు నిర్మాణం చేపడుతున్నాం. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి ఇసుక దొరకడంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సచివాలయాల్లో గతంలో కూపన్లు ఇచ్చేవాళ్లు ఇప్పుడు ఏమీ అర్థం కావడం లేదు. ట్రాక్టర్లు తీసుకొని రీచ్‌కు వెళితే లోడింగ్‌కు రెండు మూడు రోజులు అవుతుంది ఇలా అయితే ఇల్లు నిర్మాణం 100 రోజుల్లో ఎలా పూర్తి చేస్తారు.

– యువరాజ్, గృహ నిర్మాణదారుడు, జీడీ నెల్లూరు

ఇల్లు గడవడం ఇబ్బంది



ఇసుక లేకుండా ఇల్లు నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితం అని పేరుకే చెప్పినా ఎక్కడ కూడా ఉచితంగా దొరకడం లేదని, అవసరానికి ఇసుక దొరకక నాన్న అవస్థలు పడుతున్నారు. మేస్త్రి పనిచేసుకుని జీవనం గడుపుతున్న మాపై ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక లేకపోతే నిర్మాణం పని లేక ఇల్లు గడవడం కష్టమవుతుంది.

– కార్తీక్, మేస్త్రీ, బంగారెడ్డి పల్లి

పనుల్లేక అవస్థలు



కూలీ పనులు లేక అవస్థలు పడుతున్నాం. ఇసుక లేకుండా మేస్త్రీకి, కూలీ పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. వారం వారం కూలికి వెళుతూ సరుకులు, ఇంటికి కావసినవి తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు పనులు లేక అవస్థలు పడుతున్నాం. అప్పు కూడా దొరకడం లేదు. ఎలా కట్టుకోవాలి ఇల్లు. ప్రభుత్వం పట్టించుకుని సమస్యలను పరిష్కరించాలి.

– సుబ్రమణ్యం, కూలీ, బంగారెడ్డి పల్లి